క్లుప్తంగా

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



బలిజపాలెంలో కొలువైన దుర్గాలమ్మ

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజపాలెం గ్రామంలో కొలువైన దుర్గాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మామిడి కొండాజీ తెలిపారు. గ్రామంలోని వరసిద్ధి వినాయక సేవా సంఘం,శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు నూకాంబిక పండగ



నూకాంబిక అమ్మవారు

సింహాచలం: కొత్త అమావాస్యను పురస్కరించుకుని సోమవారం 98వవార్డు పరిధి చాకిరేవుకొండలో కొలువైన నూకాంబిక అమ్మవారి పండగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 4 గంటల నుంచి సుప్రభాతసేవ, నిత్యార్చన నిర్వహించనున్నారు. 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విశేష అర్చనలు, సాయంత్రం 4గంటల నుంచి అమ్మవారి ఊరేగింపు, తదుపరి అగ్నిగుండం తొక్కే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రేలారే రేలా, తీన్ మార్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణ స్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతి ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించిన హార్బర్ ఏసీపీ



సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఏసీపీ మోసెస్‌పాల్

దాబాగార్డెన్స్ : ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పలు సమస్యాత్మక ప్రాంతాల్లో హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్ ఆదివారం పర్యటించారు. రౌడీ మూకలను హెచ్చరించారు. రాత్రి వేళల్లో మద్యం సీసాలతో హల్‌చల్ చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

మహర్దశ



పెందుర్తి జూనియర్ కళాశాల

నాడు: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల.. ఈ పేరు వింటేనే ఘన చరిత్ర కళ్ల ముందు కదలాడుతుంది. ఎందరో ఉద్దండ నేతలు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులను అందించిన చదువుల నిలయం. కానీ ఆ కళాశాల దశాబ్దాల కాలంగా శిథిలావస్థలోనే ఉండిపోయింది. తరగతి గదులు లేక..ఉన్నా కూర్చోవడానికి వీలు లేక..మరుగుదొడ్లు కట్టక..కనీసం తాగునీరు ఏర్పాటు చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇక్కడ చేరేందుకు విముఖత చూపించే దుస్థితి.

నేడు: కళ తప్పిన కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది. కళాశాల దుస్థితిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నాడు–నేడు ఫేజ్–2లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు రూ.1.79 కోట్లు విడుదల చేసింది. దీంతో కళాశాల కొత్త హంగులు సంతరించుకుంది.

- పెందుర్తి కళాశాలకు నాడు–నేడు కింద రూ.1.79 కోట్ల కేటాయింపు
- కళాశాలలో నూతన హంగులు
- చురుగ్గా సాగుతున్న పనులు
- విద్యకు పెద్దపీట వేసిన ప్రభుత్వం



నూతనంగా ఏర్పాటు చేసిన బెంచీలపై విద్యార్థులు

పెందుర్తి: టీడీపీ ప్రభుత్వ హయాంలో పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేయడం తప్పా ఆచరణలో చూపలేదు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరైన అప్పటి టీడీపీ ప్రజాప్రతినిధులు ఇక్కడి పరిస్థితిని కళ్లారా చూసినా సౌకర్యాల కల్పనకు ఆసక్తి చూపలేదు. అనేకసార్లు విద్యార్థులు, అధ్యాపకులు టీడీపీ ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను విన్నవించినా ఫలితం లేదు. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదంటే టీడీపీ సర్కారు విద్య విషయంలో ఎంత శ్రద్ధ ఉండేదో అర్థం అవుతోంది.

మాటిచ్చారు..నిలబెట్టుకున్నారు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం దేశానికే ఆదర్శంగా నిలిచింది.



నూతనంగా ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీరు యూనిట్

పెందుర్తి జూనియర్ కళాశాల పరిస్థితిని కొందరు అధ్యాపకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. నాడు–నేడు ఫేజ్–2లో జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు రూ.1.79 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆయా నిధులను 7 రకాల సౌకర్యాల కల్పనకు కేటాయించారు. తక్షణ నిధుల సర్దుబాటు కింద దాదాపు రూ.70 లక్షల వరకు విడుదల చేసి పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

కల్పించనున్న వసతులు

- కళాశాలలోని అన్ని తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటుకు రూ.3,13,176 కేటాయించారు. దీంతో 64 బోర్డులు ఏర్పాటు చేశారు.
- ఫర్నీచర్ ఏర్పాటుకు రూ.37,84,342 కేటాయించారు. ప్రస్తుతం అమర్చుతున్నారు.
- విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.13,02,154 కేటాయించారు. ప్రస్తుతం మరుగుదొడ్ల నిర్మాణం 95 శాతం పూర్తయింది. రన్నింగ్ వాటర్ కోసం పైప్‌లైన్ కనెక్షన్లు ఇస్తే అవి పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి వచ్చేస్తాయి.
- కళాశాల మొత్తానికి పూర్తిస్థాయి విద్యుత్ సదుపాయం కోసం రూ.9,12,709 కేటాయించారు. ఆ పనులు దాదాపు పూర్తయ్యాయి.
- విద్యార్థులు, సిబ్బందికి సురక్షిత తాగునీటిని అందించేందుకు రూ.7,71,493 కేటాయించగా..ఆయా నిధులతో రెండు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కళాశాలలో తాగునీరు పూర్తిస్థాయిలో అందుతోంది.
- కళాశాల మొత్తానికి రంగులు వేసేందుకు రూ.38,25,195 కేటాయించారు. సెలవుల్లో ఆ పనులు పూర్తి చేయనున్నారు.
- ఇతర చిన్నా, పెద్ద నిర్వహణ పనులకు రూ.70,37,370 కేటాయించారు. ఆయా నిధులతో కళాశాలలో అన్ని గదులకు గ్రానైట్‌తో ఫ్లోరింగ్ వేశారు. తలుపులు, కిటికీలు, గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఇతర చిన్నాచితకా పనులు రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



కళాశాల ఆవరణలో వేసిన గ్రానైట్ ఫ్లోర్

ప్రతీ కార్యకర్త ఓ సైనికుడే..



సమావేశానికి హాజరైన గుర్రంపాలెం ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- పెత్తందార్లను తరిమికొట్టాలి
- కార్యకర్తలందరికీ సముచిత స్థానం
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: నిరుపేదల కడుపు కొట్టేందుకు కూటమి పేరుతో టీడీపీ–జనసేన–బీజేపీ పెత్తందార్లు ఇక్కడకు వచ్చి పోటీ చేస్తున్నారని..ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఓ సైనికుడై వారికి ఎదురుగా నిలబడాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పెందుర్తి మండలంలోని గుర్రంపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మంచిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పెత్తందార్ల ధన బలాన్ని తరిమికొట్టాలన్నారు. రానున్న రోజుల్లో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. పార్టీ కేడర్ అంతా ఏకతాటిపై నడిచి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎన్నో సేవలందించిన నక్కా కనకరాజు అకాల మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ముందుగా దివంగత నేత నక్కా కనకరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, ఉగ్గిన గోవింద్, గండి రవికుమార్, గొరపల్లి శ్రీను, నక్కా మహేష్, సుకవాసి సతీష్, నక్కా అప్పారావు, మహేష్, బొడ్డు ప్రకాష్, చిరికి దేముడు, గొర్లె రామునాయుడు, పాలు దేముడు, వెంకటపతిరాజు, బంధం రాంబాబు, సియ్యాద్రి బాలచంద్ర, ముదపాక శివ, గిరి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠంపజేసి అష్టోత్తర శతనామవళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

పైడివాడ అగ్రహారంలో వివాదం



పైడివాడ అగ్రహారంలో వివాదానికి దిగుతున్న ఇరువర్గాలు

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామ రెవెన్యూ పరిధిలో ఓ స్థల విషయమై రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. వైఎస్సార్ కాలనీ కాలనీ రోడ్డు కోసం స్థలం కేటాయించారని గ్రామస్తులు వాదిస్తుండగా.. ఆ స్థలం తమదే నంటూ రైతులు వాదించడంతో ఆదివారం ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

వివరాలు..

కాలనీకి వెళ్లడానికి లంకెలపాలెం నుంచి సబ్బవరం వెళ్లే రోడ్డును అనుసంధానం చేస్తూ సర్వే నెంబర్ 1లో సుమారు 40 అడుగుల రోడ్డును అప్పట్లో కేటాయించారని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఇదే రెవెన్యూ గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఎరుకునాయుడుపాలెం గ్రామస్తులు రోడ్డుకు కేటాయించారని చెబుతున్న భూములు తమవేనని చెబుతున్నారన్నారు. అయితే ప్రహరీ నిర్మిస్తే కాలనీకి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడతామని గ్రామస్తులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సీతారాముల పరిణయానికి ఏర్పాట్లు

దాబాగార్డెన్స్ : లోకాభిరాముడు శ్రీరాముడు జనకసుత జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించడంతో జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 9 నుంచి 18 వరకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మిరుమిట్లు గొలిపే దీపాలంకరణ చేపట్టారు.

కార్యక్రమాలివీ..

ఈ నెల 9 నుంచి 18 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్యాణరాట, పెండ్లికుమారుని చేయుట, పంచాంగ శ్రవణం జరపనున్నారు. 10 నుంచి 18 వరకు ప్రతి రోజూ ఉదయం స్వామికి విశేష ఆరాధన, సహస్రనామార్చన, సాయంత్రం వేళల్లో విశేష ఆరాధన, హారతులు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 ఉదయం 5 గంటలకు స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు జరపనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు స్వామి కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 18న శ్రీరామ పట్టాభిషేకం జరపనున్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891–2528645, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

దేశ సంపదను అమ్మే హక్కు కేంద్రానికి లేదు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ అర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1151వ రోజుకు చేరుకున్నాయి. పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, సీఐటీయూ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోది స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. దేశ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి అమ్మే హక్కు మాత్రం ఎవరిచ్చారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, గాజువాక సీపీఎం అసెంబ్లీ అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, ఇతర పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఉత్సవ ఏర్పాట్లపై నిర్వాహకులతో సమీక్షిస్తున్న సీపీ రవిశంకర్

భీమునిపట్నం: భీమిలిలో గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవ ఏర్పాట్లను విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదివారం పరిశీలించారు. ఆయన అమ్మవారి ఆలయం వద్దకు రాగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడితూరి శ్రీనివాసరావు ఏర్పాట్లను వివరించారు. ఆలయం వద్ద భక్తుల దర్శనాలకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, తాగునీరు, నీడ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు పరిశీలించిన సీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గంట స్థంభం వేదిక వద్ద బాణసంచా కాల్చడం, నేల వేషాలు, బళ్ల వేషాలు నిర్వహణ తీరును వివరించారు. అనంతరం సీపీ రవిశంకర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సీఐ రమేష్‌కు సూచించారు.

నూకాంబిక జాతరకు విస్తృత ఏర్పాట్లు



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో మాలధారణ భక్తులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం కొత్త అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి జాతరను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. 35 ఏళ్ల కిందట స్వర్గీయ బోకం దేముడు బాబు అమ్మవారి ఆలయం నిర్మించిన నాటి నుంచి అమ్మవారి జాతర నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. దీనిలో భాగంగా సోమవారం అమ్మవారికి కుంకుమార్చన,ధూప దీప నైవేద్యాలు సమర్పించనున్నట్లు తెలిపారు. భక్తులంతా జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని కోరారు.

ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్యం–నా హక్కు' అన్న నినాదంతో 1948 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు మంచినీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, చక్కటి ఆహారం భుజించాలన్నారు. ఈ ర్యాలీలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల శిబిరానికి విశేష స్పందన



దివ్యాంగులకు కొలతలు తీస్తున్న నారాయణ సేవా సంస్థాన్ సిబ్బంది

సీతంపేట: రాజస్థాన్ ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కృత్రిమ అవయవాల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించింది. రాష్ట్రం నలుమూల నుంచి సుమారు 500 మంది దివ్యాంగులు కృత్రిమ అవయవాల కోసం కొలతలు తీయించుకున్నా రు. వారికి రెండు, మూడు నెలల్లో కృత్రిమ అవయవాలు అందజేస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మార్వాడి సంస్థలు, లయన్స్ క్లబ్, ఆంధ్రా ఆర్టిస్ట్ ఫెడరేషన్, సోషల్ మీడియా క్లబ్, డాక్టర్ చిరంజీవి కళాపరిషత్, స్థానిక నారాయణ సేవా సంఘం ప్రతినిధులు వైద్య శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు ఆహారం అందించారు. నారాయణ సేవా సంస్థాన్ డైరెక్టర్ రంజిత్ గౌడ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అంతా సమష్టిగా పని చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సచివాలయ కన్వీనర్ అచ్చిబాబు

పరవాడ: పెందుర్తి ఎమ్మెల్యేగా మరోసారి అదీప్‌రాజ్‌ను గెలిపించుకోవడానికి అంతా సమష్టిగా పని చేద్దామని ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు పిలుపునిచ్చారు. ముత్యాలమ్మపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పార్టీ బలంగానే ఉందన్నారు. పార్టీ నుంచి ఎటువంటి వలసలు లేవన్నారు. వాపు చూసి బలమని ప్రతిపక్ష పార్టీలు సంబర పడుతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని మళ్లీ గెలిపించుకొని ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సూరాడ చినమసేను, సూరాడ మసేను, దూడ అప్పారావు, అరిజిల్లి మసేను, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

సింధియా: కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపును ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలను శాస్త్రోక్తంగా అలంకరించి వార్డులోని పురవీధుల్లో మేళాతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూనూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలను ఈ నెల 9వ తేదీ వరకు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. సోమవారం కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం అనుపుమహోత్సవాన్ని మందుగుండు సామగ్రి, నేల డ్యాన్సులతో భారీ ఎత్తున నిర్వహిస్తామన్నారు.

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల గ్రామ దేవత నూకాలమ్మ పండగ సందర్భంగా ఆదివారం సాయంత్రం తొలేళ్లను అట్టహాసంగా నిర్వహించారు. బాజీ జంక్షన్‌లో అమ్మవారి ప్రతిమలకు అలంకరణచేసి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, విచిత్రవేషధారణలు, తప్పెటగుళ్ల, కోలాటాల నడుమ అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగునా ఘటాల ఊరేగిస్తున్న భక్తులకు స్థానికులు పసుపు నీళ్లతో కడిగి పూజలు చేశారు.

నేడు ప్రధాన పండగ

గోపాలపట్నం ప్రధాన రహదారిలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి ప్రధాన పండగ సోమవారం జరుగుతుందని ఆలయ చైర్మన్ మళ్ల సతీష్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని చెప్పారు. సాయంత్రం తీర్థ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.